క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



కొల్లాపూర్: రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్లను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ క్విజ్ పోటీలలో పాల్గొనే వారు జూలై 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పూర్తిగా తెలంగాణలోని యువశక్తిని మేలుకొలిపేందుకు ఈ పోటీ ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌రావు, అశోక్‌గౌడ్, రాము యాదవ్, కాంతారావు తదితరులు ఉన్నారు.

చెంచుల ఉనికిని దెబ్బతీసేందుకు కుట్ర

మన్ననూర్: ఆదివాసీ చెంచుల ఉనికి కనుమరుగు చేసేందుకు పాలకులు వివిధ రూపాల్లో చేస్తున్న కుట్రలో భాగమే ఆలయం ముందు అక్రమ తవ్వకాలని మన్ననూర్ వీటీడీఏ అధ్యక్షుడు, చెంచు సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాజేంద్ర ప్రసాద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. పాలకులు, అధికారులు కొంత కాలంగా ఏదో ఒక రకంగా ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మన్ననూర్–అచ్చంపేట ప్రధాన రహదారిలో చెంచుల ఆరాధ్య దైవం లింగమయ్యస్వామి ఆలయంతో పాటు ఆలయానికి ఎదురుగా పోతురాజు విగ్రహం దశాబ్ధాల కాలంగా కొలువుదీరి ఉన్నాయి. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు పోతురాజు విగ్రహం ఎదుట కందూర్లు, భోజన ఏర్పాట్లు, అన్నదానాలు చేసుకుంటారని తెలిపారు. అటవీశాఖ అధికారులు పోతురాజు విగ్రహం వద్దకు భక్తులను రాకుండా చేసేందుకు జేసీబీతో కందకాలు తీస్తూ కొంత కాలంగా ఇబ్బందులకు గురి చేయడం దురదృష్టకరమన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగించే చర్యలకు స్వస్తి చెప్పి తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

గడువు పెంచాలి

మన్ననూర్: వెనుకబడిన కులాలలోని (బీసీ) చేతి వృత్తుల వారికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందించే రూ. లక్ష సబ్సిడీ రుణం కోసం దరఖాస్తు గడువు పొడిగించాలని బీసీ సంఘం కమిటీ సభ్యులు కోరారు. అవసరమైన ధ్రువపత్రాలు తీసుకునేందుకు మీ సేవలలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేక రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని అన్నారు. మారుమూల గ్రామాలు కుడిచింతలబైలు, సార్లపల్లి, వటువర్లపల్లి చెందిన బీసీలు కొన్ని రోజులుగా కుల, ఆధాయ ధ్రువపత్రాల కోసం మండల కార్యాలయాలు, మీసేవ చుట్టూ తిరుగుతున్నారన్నారు. అధికారులు ఆలోచించి మరో వారం రోజుల పాటు అవకాశం కల్పించాలని కోరారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బీసీ రుణ దరఖాస్తుకు గడువు తేదీని పెంచాలని రజక కులవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి నవీన్ శనివారం ప్రకటనలో కోరారు. గడువు తేదీ ఈ నెల 20 వరకే ఉండడం వల్ల అర్హులైన బీసీలు నష్టపోయే అవకాశం ఉందని, ప్రభుత్వం పునరాలోచించాలని పేర్కొన్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ

చారకొండ: మండలంలోని గ్రామాల్లో ఇటీవల చేపట్టిన ఉపాధి హామీ పనులపై రెండో విడత సామాజిక తనిఖీ ప్రారంభమైంది. బృందం శనివారం జూపల్లి, తిమ్మాయిపల్లి, తుర్కలపల్లి పంచాయతీ కార్యాలయాల్లో తనఖీ చేపట్టారు. మూడు రోజుల్లో మండలంలోని గ్రామాల్లో తనిఖీ పూర్తి చేసి పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభ ఉంటుందని ఎంపీడీఓ జయసుధ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైస్ ఎంపీపీ గోవర్ధన్ సూచించారు. శనివారం మండలంలోని తోటపల్లి, రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జన్ ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు విషయాలపై వైస్ ఎంపీపీ వైద్య సిబ్బందితో ఆరా తీయడంతో పాటు రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో భీమ్లానాయక్, శ్యాంప్రసాద్ రెడ్డి, మౌనిక, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, గెల్వయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని రాయిచేడ్‌లో శుక్రవారం సాయంత్రం కారు ఢీకొట్టడంతో గ్రామానికి చెందిన నకిరెకంటి అమృత, చింతకుంట్ల అనిత మృతి చెందగా, ఎత్తపు ఉస్సేనమ్మ తీవ్ర గాయాలతో మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. అదేవిధంగా మృతురాలు అనిత పిల్లలు లోకేష్, లాత్విక ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ఈమేరకు శనివారం అమృత కుమారుడు నకిరేకంటి రంజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ అచ్చంపేట మండలం వంకమూలితండాకు చెందిన వర్త్య మంగ్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. అతివేగంతో అజాగ్రత్తగా కారు నడపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండాల్లో గిరిజన సంబరాలు



తెలకపల్లిలో గిరిజనులతో అధికారులు

తెలకపల్లి: గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని సర్పంచ్ నీలమ్మ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని బోరబండతండా లో గిరిజన సంబరాలు నిర్వహించారు. పంచాయతీ ఆవరణలో ప్రత్యేక గిరిజన గ్రామసభ చేపట్టారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఏర్పడిన తర్వాత తండాలు, గిరిజనుల అభివృద్ధిలో ఎంతో మార్పు ఉందన్నారు. అనంతరం గిరిజనులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లాలూనాయక్, మండల ప్రత్యేక అధికారి స్వామి, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ వెంకటయ్య, ఏపీఎం నిరంజన్, సీసీలు సుఖునయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చేయూతనివ్వాలి

తాడూరు: గ్రామాల అభివృద్ధికి చేయూతనివ్వాలని సింగిల్ విండో చైర్మన్ సమ్మద్‌పాష అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని లచ్చిరాంతండాలో సర్పంచ్ కృష్ణనాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రత్యేక పంచాయతీలు లేకపోవడం వల్ల తండాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఒకే సారి అభివృద్ధి కావాలంటే ఆర్థికపరమైన ఇబ్బందులు ఉంటాయని విడతల వారీగానే అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం గిరిజనులంతా ఆటపాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణ, వ్యవసాయాధికారి సాయిరమేష్, ఏపీఎం తిరుపతయ్య, ఏపీఓ ప్రవీణ్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

తండాల్లో ప్రత్యేక అభివృద్ధి

బిజినేపల్లి: గిరిజన తండాల్లో అభివృద్ధి స్పష్టంగా కన్పిస్తుందని, గతంలో తండాలకు కనీస గుర్తింపు కూడా లేకపోయిందని తిమ్మాజిపేట మండలం చంద్రాయన్‌పల్లితండా సర్పంచ్ రవికుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చంద్రాయన్‌పల్లితండాలో సంతు సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలు పంచాయతీలుగా ఏర్పడ్డాక నర్సరీలు, వైకుంఠధామాలు, పంచాయతీ భవనాలు, బోరుబావులు, గిరివికాస్ వంటి పథకాలు వచ్చాయన్నారు. ప్రత్యేకంగా సీసీ రోడ్డు, ఇతర ప్రభుత్వ భవనాలు కూడా తాము ఏర్పాటు చేసుకుని తండాలను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మాచారి, పంచాయతీ కార్యదర్శి రాధిక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు అక్షరాభ్యాసం

కల్వకుర్తిరూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని వెంకటాపూర్ తండాలో గిరిజన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, సర్పంచ్ రమేష్‌నాయక్, ఎంపీటీసీ శంకర్‌నాయక్, ఉపసర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



తాడూరులో నృత్యాలు చేస్తున్న అధికారులు, తండావాసులు



కల్వకుర్తిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు



తిమ్మాజిపేటలో సంతుసేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

గిరిజనుల కల నెరవేర్చిన సీఎం కేసీఆర్



ఉబ్బలగట్టుతండాలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: గిరిజనతండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఏళ్లగా గిరిజన ప్రజలు పోరాటం చేశారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి వారి ఏళ్ల కలను నేరవేర్చారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆయా తండాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజనాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో రూ.2కోట్లతో సేవాలాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.

పంచాయతీ భవనాలకు రూ.2.20కోట్లు

మండలంలోని 11 గిరిజనతండాల్లో పంచాయతీల భవన నిర్మాణాలకు ఒక్క భవనానికి రూ.20లక్షల చొప్పున రూ.2.20కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. శనివారం ఉబ్బలగట్టుతండా, గుండాల, నగారగడ్డతండాలో భూమిపూజ చేశారు. బొల్లిగుట్టతాండలో సీసీరోడ్డుకు భూమిపూజ చేశారు. గిరిజన తండాల లింక్‌రోడ్లు వేసేందుకు రూ.13కోట్లు మంజూరైనట్లు వివరించారు. గిరిజనులకు 6శాతం ఉన్న రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వం రూ.10శాతానికి పెంచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్‌ఎంపీపీ శాంతి, సర్పంచ్‌లు బుజ్జి, దశరథం, మైసయ్య, పత్యనాయక్, అంజినాయక్, అంజమ్మ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, పీఆర్‌డీఈ దుర్గాప్రసాద్, ఏఈ మహేందర్ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలకు కొత్త వెలుగులు



గిరిజన చిన్నారులతో కలిసి ర్యాలీగా వస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాలతో గిరిజన జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఫంక్షన్‌హాలులో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజనోత్సవ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. అంతకుముందు చిన్నారుల నృత్యాలతో ప్రభుత్వ విప్‌కు ఘన స్వాగతం పలికారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. తండాలు, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. స్వరాష్ట్రంలో గిరిజనుల్లో కొత్త వెలుగులు నింపామన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలకు కట్టుబడి అధికారికంగా పండుగలు నిర్వహించుకుంటున్నామన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లతో ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో రిజర్వాయర్‌లను పూర్తి చేసి రైతుల పాదాలను కృష్ణమ్మ నీటితో కడుగుతానన్నారు. భవిష్యత్‌లో గిరిజనబంధు కూడా అందిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ భోజనాలు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, డీఎఫ్ఓ రోహిత్‌గోపిడి, ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, తులసీరాం, రాంబాబునాయక్, గోపాల్‌నాయక్, జైపాల్‌నాయక్, శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలో పర్యటించారు. ఎన్‌టీఆర్ చౌరస్తా, జగ్జీవన్‌రాం చౌరస్తాతో పాటు ప్రధాన కూడళ్లలో జంక్షన్‌లను పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణతో పాటు పార్కుల సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బోజ్యానాయక్, చంద్రశేఖరాచారి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గాలియాదవ్ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: పేదల ఆరోగ్యాలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సాతాపూర్ చెందిన కోళ్ల కన్నయ్యకు రూ.23వేల చెక్కును అందజేశారు.

యాదవుల హక్కుల కోసం ఉద్యమించాలి



నియామకపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

తెలకపల్లి: యాదవుల హక్కుల కోసం ఉద్యమించాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్ యాదవ్ శనివారం సాయంత్రం మండలంలోని రాకొండలో యాదవుల హక్కువ పోరాట సమితి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన జిల్లా కార్యదర్శిగా కొట్టె తిరుపతయ్య, జిల్లా అధ్యక్షుడిగా శంకర్, గ్రామ అధ్యక్షుడిగా రెడ్డమోని ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా వేముల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా కొట్టె యాదగిరి, కార్యదర్శిగా అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక శాతం యాదవులు ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

కందనూలు: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ నాగర్‌కర్నూల్ లెర్నర్ సపోర్ట్ సెంటర్ (స్టడీ సెంటర్)లో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ సమన్వయకర్త శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఏదైనా రెండు సంవత్సరాలు డిప్లమా కోర్సు పూర్తి చేసిన వారు, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందవచ్చునని పేర్కొన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వచ్చే నెల 31 వరకు ప్రవేశం పొందాలని కోరారు. వివరాలకు నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 7382929779 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



పెద్దకొత్తపల్లి: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంతో పాటు దేవల్‌తిరుమలాపూర్, వెనచర్ల, నక్కలపల్లి, ఆదిరాలలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిపాలన 9ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భరత్‌చంద్ర, జలాల్ శివుడు, భీమేష్, రాజు, ప్రవీన్, తిరుమల్, సుధాకర్‌రావు, మార్కండే య, జగదీష్, శివ, విష్ణు, కిరణ్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అడ్డుకుందాం

కల్వకుర్తిరూరల్: విద్యాసంవత్సరం ఆరంభం కావడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు విచ్చలవిడిగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ యాదవ్ ఆరోపించారు. శనివారం పట్టణంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు తీసుకుంటున్న పాఠశాలల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలను నిబంధనలకు విరుద్ధంగా అమ్మడమే కాకుండా అధిక ధరలు తీసుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రసాద్, శివ, నవీన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చెంచుపెంటలలో వైద్య శిబిరాలు



సూరాపూర్‌లో చెంచులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

లింగాల: జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పలు గ్రామాల చెంచుగూడెంలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించారు. మండలంలోని సూరాపూర్, కొత్తకుంటపల్లి, శాయిన్‌పేట, దారారం, పాతదారారం గ్రామాలలోని చెంచులు నివసించే ఆవాస ప్రాంతాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్యులు రాజీవ్, ప్రశాంత్ గర్భిణులు, చిన్న పిల్లలకు, సాధారణ రోగాలకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఉప మలేరియా అధికారి అశోక్‌ప్రసాద్, హెచ్‌ఏ రాంచందర్, ఏఎన్‌ఎంలు శైలజ, యాదాబాయి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

చెంచుపెంటలో మహిళ ప్రసవం..

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం రాంపూర్ చెంచుపెంటలో 108 సిబ్బంది సహకారంతో చెంచు మహిళ సుఖ ప్రసవమైంది. చెంచుపెంటలో నల్లపోతుల లక్ష్మమ్మ ప్రసవవేదనతో రెండు రోజులుగా ఇబ్బంది పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై 108 సిబ్బందికి సమాచారం అందడంతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అంబులెన్స్ డ్రైవర్ బషీర్, ఈఎంటీ మల్లయ్య చెంచుపెంటకు వెళ్లారు. వైద్య పరీక్షలు చేసి, అక్కడే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అంబులెన్స్ సాయంతో పెంట నుంచి శనివారం తెల్లవారు జామున అచ్చంపేట సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారని అన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



ఐతోల్‌లో కూలీలతో మాట్లాడుతున్న పర్వతాలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఐతోల్‌లో కూలీలు నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నెలలు తరబడి పనిచేస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఐతోల్‌లో 10 వారాల నుంచి పనులు చేస్తున్న డబ్బులు రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారని తెలిపారు. మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయడంలో ఉపాధి హామీ సిబ్బంది విఫలమయ్యారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వెళ్లకుండా సీనియర్ మేటీలతో మస్టర్లు వేయిస్తున్నారన్నారు. కాశన్న, బంగారయ్య, గోవిందు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి



గ్రామస్తులతో సమావేశమైన నాయకులు

లింగాల: మండలంలో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని ఐక్య వేదిక మండల బాధ్యులు రాజలయ్య, సత్యం, మురళీ, రాజేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో పలు వార్డులలో పర్యటించిన బీసీలను కలిసి కమిటీల ప్రాముఖ్యతను, ఏర్పాటును వివరించారు. బీసీలలోని ఒక్కో వర్గానికి ఒక కమిటీ చొప్పున, అన్ని వర్గాలతో కమిటీలను ఏర్పాటు చేసిన తర్వాత, ఆయా కమిటీలలో కొంత మందిని కలిసి మండల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. సమాజంలో బీసీ వర్గాలను అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని, ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్పా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

మరోసారి మోసానికే దశాబ్ది ఉత్సవాలు



మాచారంలో చెంచులతో మాట్లాడుతున్న సతీష్ మాదిగ

మన్ననూర్: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకే కులాలు, మతాల వారీగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని అచ్చంపేట నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ సతీష్ మాదిగ అన్నారు. శనివారం అమ్రాబాద్ మండలం మాచారంలో పోడు భూముల బాధిత చెంచు రైతులతో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. స్టేజీలపై ఉపన్యాసాలతో ప్రేమ ఒలకబోసే ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అమాయకులైన ఐదుగురు ఆదివాసి పోడు రైతులుపై 307 కేసు నమోదు చేయించి ఇద్దరు రైతుల ఆత్మహత్యలకు కారకుడయ్యాడని ఆరోపించారు. నిరంజన్, లింగమ్మ భూముల బాధిత రైతులు ఆత్మహత్యకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని అసెంబ్లీ నిండు సభలో హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పట్టా ఇవ్వకపోగా గిరిజన అభివృద్ధి ఉత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మంగ్యానాయక్, బాలాజీ, రాజు, మల్లేష్, రవి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం



కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై ఉద్యమించేందుకు యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దామని నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో యువజన కాంగ్రెస్ కమిటీల నియామకం చేశారు. మండల మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మాలిక్‌పాష, ఇర్ఫాన్, కార్యదర్శులుగా వసురాం నాయక్, ప్రేమ్‌కుమార్‌లను నియమించారు.బాలరాజు, జంగయ్య గౌడ్, సందీప్‌రెడ్డి, సంతోష్, గోపాల్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి బారులు



తెలకపల్లి: ప్రభుత్వం బీసీల్లో కులవృత్తుల కోసం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తుందని ప్రకటించడంతో వారం రోజులుగా మండలంలో మీసేవా కేంద్రాల వద్ద జనాలు బారులు తీరారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిత్యం ఆధాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 చివరి తేదీ కావడంతో మీ సేవా కేంద్రాలతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున లబ్ధిదారులు కంప్యూటర్ గది వద్ద బారులు తీరుతున్నారు.

ఓటర్ల జాబితా పూర్తి చేయండి

కొల్లాపూర్ రూరల్: నియోజకర్గంలో ఉన్న ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, డబుల్ ఓటర్లను గుర్తించి జాబితా పక్రియను ఎన్నికల సమయం నాటికి పూర్తి చేయాలని బూత్ లెవల్ ఎన్నికల అధికారులను ఆర్డీఓ హనుమానాయక్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

నేడు మంచినీటి పండుగ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంచినీటి పండుగను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ శనివారం ప్రకటనలో తెలిపారు. మంచినీటి పండుగలో భాగంగా ఓహెచ్‌ఆర్ ట్యాంకుల వద్ద ముగ్గులు వేయాలని, పంచాయతీ వద్ద గ్రామసభను ఏర్పాటు చేసి 2014 కంటే ముందు, తర్వాత మంచినీటి సరఫరా వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు ప్రజలకు వివరించాలని సూచించారు. మధ్యాహ్నం 1 గంటకు గౌరిదేవిపల్లిలో ఉన్న తాగునీటి శుద్ధీకరణ కేంద్రం వద్దకు రావాలని, అక్కడే భోజన వసతి కూడా ఉంటుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

వీసీలో పాల్గొన్న ఆర్డీఓ

తాడూరు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో శనివారం ఆర్డీఓ నాగలక్ష్మి వీసీలో పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ నమోదు, తొలగింపు, చేర్పు అంశాలపై సీఈఓ వికాస్‌రాజ్ వీసీలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ మహమూద్ అలీ, ఆర్‌ఐ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.